# మనసు

"అమ్మా! అక్కా, బావొచ్చారే!" చిన్నకూతురు మానస కేక విని చేతులు కొంగుకు తుడుచుకుంటూ గబగబా బయటి కొచ్చింది. దేవకి వయసుభారం. ఆయాసమొస్తోంది. బయటి గేటు దాని వస్తున్న పెద్దకూతురు భారతికెదురేగి కౌగిట్లో బంధించింది.

"బాగున్నారా బాబూ!" అల్లుణ్ని అప్యాయంగా పలుకరించింది. ఎదపొదలోని ఆనందం కళ్లల్లో మెరిసింది.

"బాగున్నానత్త గారూ!" సుధీర్ నవ్వబోయాడు. చేతులోని సూట్‌కేసు భారంగా తోచింది. మానసకు జాలేసింది.

"బావకేమ్మా! ఇన్‌కంటాక్స్ డిపార్టుమెంటులో ఉద్యోగం. గుండ్రాయి లాగున్నారు. అక్కనే పాపం! బక్కచిక్కి పోయింది" పెదాలు చప్పరించింది. సుధీర్‌కు ఎదురెళ్లి సూట్‌కేసం దుకుంది.

మదరలి నెత్తిమీదో మొట్టికాయ వడ్డిస్తూ, "ముప్పూటలా తినలేక.. పాపం! మీ అక్కయ్య లావైపోయింది!" నవ్వేశాడు. మానస కాటుక కళ్లు విష్ణుచక్రాల్లా తిరిగినై.

"మా అక్క అమ్మాయకురాలు!"

"అబ్బో! ఏమో అనుకున్నా. మా మరదలు మాటకారే. సిసింద్రీ మానసకు చిచ్చుబుడ్డి మొగుడు దొరుకుతాడులే."

"మా చెల్లి అతణ్ని మూడుదేశాలు తిప్పి సప్తసముద్రాల నీళ్లు తాగించి తీరుతుందండీ!" భారతి కనుబొమలు గర్వంగా ఎగిరిపడినై.

"అంతేనంటావా!"

"కాదా మరి. మీరెలాగూ దానికి అమెరిక సంబంధం తెస్తామన్నారు. గదా!' తల్లి నుంచి విడిపోయి చెల్లి బుగ్గలు నిమిరింది భారతి. మానస మనసులో మలయమారుతం వీచింది. దేవకి సంతృప్తిగా నవ్వింది.

దీపావళి పండక్కి ఓ రోజు ముందుగానే వస్తామని అంతకుముందే ఫోన్‌లో చెప్పాడు సుధీర్. అన్నమాట ప్రకారం వచ్చినందుకు నారాయణ సంబరం అంబరాన్నంటింది.

"ఏమ్మా భారతీ!" కూతురి తల నిమిరి "పిల్లలేరి అల్లుడూ?" అల్లుణ్ని పలుకరించాడు. సుధీర్ పైకి చూస్తూ ఇల్లు గట్టిదనాన్ని పరిశీలిస్తున్నాడు. భారతి తల తండ్రి ఒడిలో ఉంది.

"పిల్లలు రాలేదు మావయ్యా!"

"పెద్దవాడు మెడిసిన్ ఫస్టియరాయె. చిన్నాడు ఎంసెట్ కోచింగాయె.. ఇద్దరూ హైద్రాబాదులో ఉన్నారు మావయ్యా! అయినా ఈ మారుమూల ఊళ్లోవాళ్లు చూసేదేముంది? చేసేముంది?" కొట్టి పారేశాడు.

అల్లుని అభిప్రాయమేమీ బాగన్పించలేదు నారాయణకు.

"పాడిపంటలకు పుట్టినిల్లు పల్లెటూరే అల్లుడూ! రేపటి పౌరులకు పల్లెటూరి వాతావరణం తెలీకపోతే వరిచెట్లు, మామిడితీగలు. అనేస్తారు" అనేశాడు. గొల్లున నవ్వారంతా.

ఈయనదంతా చాదస్తం. సుధీర్ మొహంలో రంగులు మారాయి.

ట్రేలో చాయ్‌కప్పులతో వచ్చేసింది మానస. "చాయ్ గరం గరం తీసుకోండి బావగారూ?" రైలు డబ్బాలో చాయ్ కుర్రాడిలా రాగాలుదీస్తూ సుధీర్ ముందుకొచ్చింది. సుధీర్ తీక్షణ దిక్కులు మరదలిమీద వాలినై.

సింధూరవర్ణం దేహఛయ, ముద్దమందారం మొహం, పెద్దపెద్ద కళ్లు, వయసు పొంకం మానస మానవరూపంలో ఉన్న దేవకాంతలా కన్పించింది. చాయ్ సిప్ చేస్తున్నాడు. మిగతావారికి చాయ్‌లందుతున్నాయి.

ఆనాడు తమకు సంతానయోగం లేదనుకుని అత్తా, మావయ్యలు భారతిని అనాథ శరణాలయం నుంచి తెచ్చుకుని పెంచుకున్నారుట. కాని ఏం లాభం? భారతి ఎస్సెస్సీ పాసైంతర్వాత ఈ మానస పుట్టిందట. ప్రౌఢ దంపతుల కోర్కె అలా తీరాలి. పాపం.. అంత లేటు వయసులో... ఎంత ఘాటు కోర్కెనో!.

❖ ❖ ❖ ❖

హైద్రాబాదులో బయలుదేరి పట్నం దాటి ఆర్టీసీ బస్సు పల్లెటూళ్లగుండా ప్రయాణిస్తోంది. ప్రయాణీకులతో కిటకిటలాడుతూ నిండు గర్భిణిలా ఉంది.

ఆనాడు నేనా ఆర్మీలో చేరకపోతే ఆ రోజీ బ్యాంకు ఉద్యోగమొచ్చేదా? కృత్రిమ కాలును సరిగా సర్దుకుని సీటు వెనక్కు ఒరిగాడు మధుకర్. బస్సు ముందుకు పరుగులు తీస్తుంటే ఆలోచనలు వెనక్కు లాక్కెళ్తున్నాయి.

చిన్నప్పుడే అమ్మా నాన్నల్ని కోల్పోయాక మేనమామ నారాయణ లేకపోతే తానేమైపోయేవాడో! ఆక్సిడెంటులో ప్రాణాలొదుల్తూ అమ్మానాన్నలు మావయ్య చేతుల్లో ఉంచి... ఎంతో మేలు చేశారు.

ఇంటర్ పాసవగానే ఆర్మీలో ఉద్యోగమొచ్చింది. జాయినయేందుకెళ్ల బోతుంటే... మామయ్య మనసు అల్లకల్లోలమైంది. కళ్లు చిప్పిల్లినై.

"మీల్ట్రీ ఉద్యోగం మనందరికీ గర్వకారణమే మధూ! కాని... నువు నా గారాల చెల్లి తీపి గుర్తువు.. గొంతులో ఏమైందో ఇహ మాట పెగల్లేదు.

"పై చదువులు చదివితే మరో ఉద్యోగం దొరకదా!" చివరి నిమిషంలో అత్తయ్య ఆరాటం! "కొడుకులు లేని మాకు నువ్వే కొడుకువనుకున్నాం. ఇప్పటికైనా ఆలోచించుకో బాబూ!!" కొంగుతో కళ్లద్దుకుంది.

"అత్తయ్యా ఆహారం, నిద్ర, భయం... సంతానొత్పత్తి ఇవ్వన్నీ ప్రాణులన్నిం టికీ ఉన్నాయి. మనిషికి, పశువులకు తేడా ఏమిటి? అందరూ సుఖాలనే కోరుంటే... దేశ రక్షణ గురించి ఎవరాలోచించాలి? దేహం కంటే దేశం మిన్న అని మా తెలుగు లెక్చరర్ ఎన్నోసార్లు చెప్పారు. దయచేసి నన్నాపకండత్తయ్యా...."

"అమ్మా! బావను పోనియ్యవే" పదో తరగతి చదువుతున్న మానస అంది. భారత వీరనారీమణుల కథలెన్నో చదివిందప్పటికే.

బస్సు కుదుపు. మనసు మానసను గుర్తు చేసుకుంది.

చిన్నప్పట్నుంచి గుడిలో, బడిలో చెట్టాపట్టాలేసుకొని ఆడుకున్న మరదలు. ఇప్పుడెట్లా ఉందో! పెళ్లీడుకొచ్చింది గదూ! అత్తా, మావయ్యలు వరాన్వేషణలో ఉన్నారట. ఆ ముద్దుగుమ్మనెవరు చేసుకుంటారో... అదృష్టవంతుడు. కార్గిల్ యుద్ధంలో కాలు పోకపోతే..... మానస తన సొంతమయేదే.. అవిటితనం...

కీచుమంటూ ఆగింది బస్సు కృత్రిమ కాలు సర్దుకొని లేచాడు. సాయం సమయం. హైస్కూలు ముందు బస్సు. దిగి ఊళ్లోకొస్తున్నాడు. స్కూలు చుట్టూ తలలాడిస్తున్న చెట్లు స్వాగతం పలుకుతున్నాయి.

హాయిగా పాడుకుంటున్నాడు.

మధుకర్ మనసు పురివిప్పి నర్తిస్తోంది.

ఎక్స్ సర్వీస్‌మెన్ కోటాలో బాంకు ఉద్యోగం దొరికింది. డ్యూటీలో జాయినై సంవత్సరమైంది. అప్పట్నుంచి ఊరికి రాలేదు. కొత్త ఊసులు, కొత్తబాసలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

"ఎవరూ... మధుకర్ బాబేనా?" బాగున్నావా? ఇదేనా రావడం? ఇంటిపక్క అరుగుమీద ఒరిగిన ముసలిరైతు పలుకురించాడు.

"అవును తాతా... బాగున్నావా?"

"మా బాబే! ఎంత తియ్యని నోరయ్యా! చల్లగా బతుకు నాయనా! భారతమ్మా, ఆమె మొగుడు అప్పుడే వచ్చిండ్రు పో..."

నిండుగుండె ఆశీస్సులవి. నవ్వుకున్నాడు. ఇంకా గడపదాటలేదు. "ఆహా! బోధన్ నుండి మధుబావొచ్చాడు..." చిన్న పిల్లలా కేరింతలు కొడుతూ ఎదురొచ్చింది మానస. చేతిలోంచి సూట్‌కేసు లాక్కుని "అక్కా! మధు బావొ చ్చాడే" అంటూ భారతి ముందుకు తీసుకెళ్లింది. అప్పటికప్పుడే భారతి మొహం ముడుచుకుపోయింది.

"రాడా మరి. దీపావళి కొండంత పండగాయె. ఇక్కడికి రాక ఇంకెక్కడి కెళ్తాడు?" సోఫాలో సర్దుక్కూర్చుంది.

"బాగున్నారా వదినా!" మధుకర్ పలుకరించాడు. "నమస్కారం అన్నగారూ!' సుధార్‌కభివాదం చేసి అతనిపక్కనే కూచున్నాడు. కృత్రిమ కాలును తొలగించి పక్కన బెట్టాడు. సూటుకేసులోంచి మడిచిపెట్టిన చంకకర్రనుతీసి అమర్చి పెట్టుకున్నాడు. "పిల్లలు రాలేదా అన్నగారూ"

"రాలేదులే. బ్యాంకు ఉద్యోగం బాగుందా?" సుధీర్ పలుకరింపులో చిరాకు తొంగిచూసింది. మధుకరంటే సుధీర్‌కు మంట.

'కుంతి కులాసం ఇంటికి మోసం... మామగారి ఆస్తుల్ని తేరగా తిందామని పరుగెత్తుకొచ్చాడు వెధవ!' మనసులో తిట్టుకున్నాడు.

అక్కా బావల వాలకం మానసకే మాత్రం నచ్చలేదు.

"రా బావా.... డ్రెస్సు మార్చుకో!" సూటేకేసు తీసుకెళ్లి గదిలో ఉంచింది. చంకకర్ర సాయంతో గదిలోకెళ్లబోతున్నాడు మధుకర్.

నారాయణ దంపతులు గుడినుంచి వచ్చారప్పుడే.

"ఒరే మధుకర్...! భాగున్నావా?" నారాయణ ఆత్మీయత. ఆ పిలుపు మధుకర్‌నలరించింది. "ఎన్నాళ్లైందిరా నువ్వెళ్లి...." మేనల్లుడిని అమాంతం చుట్టేశాడు. మేనమామ స్పర్శ పితృవాత్సల్యంతో తడిపేసింది... "బాగున్నావా మధూ" దేవకి మొహం విప్పారింది.

"మీ దయవల్ల బాగున్నానత్తయ్యా!" ఎద పొంగింది.

★ ★ ★ ★

"బావా... అక్కా...." పడగ్గది తలుపుమీద టకటకలు. "అక్కోయ్.... బావోయ్.. తెల్లవారకముందే హారతులు తీసుకోవాలి... లేవాలి" టకటకల స్థాయి హెచ్చింది.

"ఆఁ ఆఁ... కొంచమాగవే. ఎందుకా తొందర" భారతి ఆవులింత.

"నేనాగితే పొద్దాగుతుందా? మా అందరి స్నానాలైయిపోయినై. మీదే ఆలస్యం. నాలుగు దాటింది. మధు బావ గూడా రెడీఅయ్యాడు...."

కమ్మని నిద్ర ఖరాబైనందుకు సుదీర్ ఉసూరుమన్నాడు.

"అతనికేం... తెగిన గాలిపటం. కన్నవారిని మింగేశాడు. తోడబుట్టిన వాళ్లసలే లేరు...." విసుక్కుంటూ దుప్పటి కప్పుకున్నాడు.

"అబ్బా... మీ మాటలు బయటకు వినబడితే బావుండదు... లెగండి" దుప్పటి లాగేసింది భారతి. "సాంప్రదాయం చక్కగా పాటిస్తేనే అమ్మానాన్నలకు సంతోషం. తెల్సా?" హెచ్చరించింది.

నిద్రమత్తు చిత్తయిపోయింది.

"అవునోయ్!" లేచి కూచున్నాడు. "లేకపోతే మన మీది కోపంతో పట్నంలోని బంగళా ఆ కుంటాడికో లేక మానసకో ఇచ్చేస్తారు.." అవులింత ఆపు కుని కళ్లు నులుముకున్నాడు.

"అన్నట్టూ... మానసకో మంచి సంబంధం చూస్తే ఫైళ్లున పెళ్లైపోతుంది. ఆ తర్వాత ఆస్తుల ప్రసక్తి తేవచ్చు..."

"నిజమే భారతీ! మా ఆఫీసర్ కొడుకు ఆమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీరని చెప్పాను గదా. అతనికి మానస ఫోటో పంపించాను. ఫోటో చూసి ఆ కుర్ర ఇంజనీరు ఎగిరి గంతేశాడట. త్వరలో ఇండియా కొస్తున్నాడు. వాళ్లు కోటీశ్వరులు. మీ నాన్న పొలమూ పుట్రా, బంగళా.. అన్నా మనపాలే గదా!" సూటకేసులోంచి టూత్‌పేస్ట్, బ్రష్ తీస్తూ మురిసి పోయాడు.

"ఆఁ.. అదీ మా శ్రీవారంటే మాటలా! అ ప్రయత్నంలో ఉండండి. అంతా శుభమే జరుగుతుంది." భర్తకు తువ్వాలు అందించి బయటికిచ్చింది. "మధు తయారై పోయాడే!" అంది అదోలా.

తలంటు స్నానాలై పోయినై.

చాలా రోజుల తర్వాత కూతుళ్లు, అల్లుడు, మేనల్లుడుతో కలిసి పండుగ చేసుకోవడం... నారాయణ దంపతులకెంతో సంతోషంగా ఉంది. కూతురు. అల్లుడికి బొట్టుబెట్టి కొత్తబట్టలందించారు.

"వాళ్లేరి" దేవకి భృకుటి ముడిపడింది.

"మధూ, మానసలా? అదో. అక్కడేదో మాట్లాడుకుంటున్నారు." నారాయణ వెళ్లాడు పిలిచేందుకు.

"అమ్మా! మానసను ఆ అవిటివాడికెంత దూరంలో ఉంచితే అంత మంచిదే!" పట్టుచీర కొంగునుఅట్టహాసంగా సర్దుకుంటూ హెచ్చరించింది భారతి

'ఆమధుకర్... అవిటి....! నా చేతుల్లో పెరిగిన మధు అవిటి వాడయాడు గదూ! దేశరక్షణ కోసం యుద్ధానికెళ్లిన మధు... మోకాలు దాకా కాలు పోయింది. గదూ!....' దేవకికి గుండెల్లో గునపం గుచ్చు కున్నట్టయింది. నిజమే కదా.. అవిటివాడే. తనను తానే సమాధాన పరుచుకుంది.

"వాడు అవిటి వాడు కావచ్చు కాని అనాథ కాలేదమ్మా!" గంభీరంగా అనేసింది. వాడికి పెళ్లి చెయ్యడం మన బాధ్యతేనే భారతీ."

"అవుననుకో! ముందు చెల్లి పెళ్లి... ఆ తర్వాత అతని సంగతి ఆలోచించవచ్చు...."

"అంతా వచ్చేశాం... కానివ్వండి" నారాయణ నవ్వేశాడు. వెంట మానస, మధుకర్‌లున్నారు.

అంతా పూజగదిలోకెళ్లారు.

"ఇదే ధనలక్ష్మి పూజ గదా మావయ్యా" అడిగాడు మధుకర్.

"అవున్రా నరకాసుర సంహారంతో దరిద్ర దేవత పోయి ధనలక్ష్మి వచ్చేసిందని మన భావన. ఆ ధనలక్ష్మిని పూజించి ప్రసన్నం చేసుకుంటేనే గదా... సంపదలిచ్చేది" సుధీర్ వైపు చూస్తూ చెప్పాడు నారాయణ. కొబ్బరికాయ కొట్టి తీర్థం గ్లాసులో వంచాడు.

"అవునుగదా! సాంప్రదాయాలకు చక్కని నేపథ్యముంది. అది మనం తెలుసు కోవాలి." శృతి కలిపాడు సుధీర్. 'పెద్దలమాట చద్దిమూటన్నారు. బ్రదర్' మధుకర్ వీపు తట్టాడు. అందరూ దేవుని విగ్రహాల మీద పసుపూ, కుంకుమ, అక్షింతలు వేసి నమస్కరించి బయటికొచ్చేశారు. దేవునికి నైవేద్యంగా చేపిన సేమియాలో పంచదారకలిపి అందరికీ - తీర్థ ప్రసాదాలు పంచింది మానస.

"అదే చేత్తో త్వరలో పప్పన్నం పెట్టాలి మరదలా!" సుధీర్ అన్నాడు.

"మీ ఆశీస్సులుండాలి గాని... తప్పకుండా బావా!" మానస పెదాల మీద ముసిముసి నవ్వులు.

ఆహా! నా మరదలు నా మాట జవదాటదు.. నా ప్రణాళికకు డోకా లేదు. గర్వంగా నవ్వుకున్నాడు.

"అన్నగారి చలువ వల్ల త్వరలో మానసను పెళ్లికూతురుగా చూడొచ్చు...' మధుకర్ మనసులో మరుమల్లెలు నవ్వెనై.

సిగ్గుల భారంతో మానస చెక్కిళ్లు ఎర్రమందారాలై పోయినై. మధుకర్ ను సూటిగా చూసింది. "ఆతర్వాత మధుకర్ పెళ్లెగదా" భర్తవైపు చూసింది. భారతీ, అవునుగదా అన్నట్టుగా.

"మావయ్య మధుకర్‌కో సంబంధం వెతికి పెట్టుంటారు" ఏదో రాబట్టాలని సుధీర్ ప్రయత్నం.

బయటికెళ్లడానికి సిద్ధమైన నారాయణ ఆ ప్రయత్నం మానుకుని మధుకర్ పక్కన కూచున్నాడు. మధుకర్ పక్కనున్న చంక కర్రను జాలిగా చూశాడు.

"మీ అమ్మనోసారి పిలువమ్మా!" మానసను పురమాయించాడు.

దేవకి వచ్చి కూచుంది. నారాయణ వాలకం గంభీరంగా మారింది. "బాబూ మధూ! నువ్వెవరినన్నా ప్రేమించావా? ఏ అమ్మాయన్నా నీ మనసులో ఉందా?" సీరియస్ ప్రశ్న.

జవాబు కోసం మధుకర్ తడబాటు. దేవకికంతా అయోమయం. అందరినోసారి పరిశీలనగా చూసింది.

మధ్యన గుండ్రని టీపాయ్. అదో రౌండ్‌టేబుల్ సమావేశం లాగుంది.

నారాయణ దంపతుల పట్ల మధుకర్ అణువణువూ కృతజ్ఞతతో నిండి ఉంది. ఆ దంపతులకు మనసులోనే నమస్కరించి "మావయ్యా! నా తల్లిదండ్రులు ఎలాగుంటారో నాకు తెలీదు. మీరే నాకు అమ్మానాన్నలయ్యారు. మీకు. తెలీకుండా నేనేమీ చెయ్యలేను."

వీడో పిచ్చోడు అన్నట్టుగా మొహాలు చూసుకున్నారు భారతి, సుధీర్‌లు, మావయ్యను మచ్చిక చేసుకోవాలని సుధీర్ ఆరాటం.

"ప్రేమించడం గూడానా?" కిసుక్కుమంది భారతి.

"పెళ్లి అనేది వ్యక్తిగతం. నువ్వే అమ్మాయి మెడలో మూడుముళ్లు వేస్తానన్నా మామగారు కాదనరు బ్రదర్' తనవంతు కర్తవ్యంగా సముధాయించ బోయ్యాడు సుధీర్. ఏం మాట్లాడాలో తోచక మానసవైపు చూసింది దేవకి. విషయమేమిటో ఇప్పుడిప్పుడే అర్థమవుతోంది.

"నాన్నా! మధు బావకి జన్మనిచ్చిన దేశం పట్ల, పెంచి పోషించిన మీ పట్ల ఎనలేని ఆదరాభిమానాలన్నాయి. ..." మానస మాటలు పూర్తి కాలేదింకా.

"అందుకే గదా, నిర్మొహమాటంగా. చెప్పమంటున్నారు. నాన్నగారు..." అనగలిగింది దేవకి.

మధుకర్ మనసు తెరమీద తన ప్రేమ దేవత పంచరంగుల చిత్రం కదలాడింది. చూపులు మానసను ఆపాదమస్తకం తడుముతు న్నాయి.

మానస నరాలు సరి కొత్తస్వరాలు వినిపిస్తున్నై. హృదయవీణ కల్యాణ రాగం పలుకుతోంది. చూపులు నేలకు వాలినై.

పక్కింటి వాళ్లు చిచ్చుబుడ్డి కాలుస్తున్నారు.

"మరి... మానస ఎవరినన్నా ప్రేమించిందో ఏమో!" తన లైన్ క్లియర్ చేసుకోవాలనుకున్నాడు సుధీర్.

"బావకు థాంక్స్" మానస తలపైకి లేచింది. నారాయణ దంపతులు మొహాలు చూసుకున్నారు. కాగలకార్యం దంధర్వులే తీరుస్తారన్నట్టుగా నవ్వుకున్నారు. సుధీర్ దంపతులు.

"అయితే .... నువ్వు ప్రేమలో పడ్డావా మానసా?" నోరెల్ల బెట్టింది దేవకి.

"అవునమ్మా." పొడుగాటి పూలజడ మానస గుండెలను ముద్దాడు కుంటోంది. అంతరాళాల్లో వినిపిస్తున్న మురళీరవం చెక్కిళ్ల నెబ్రారుస్తోంది.

ప్రేమ పెళ్లికి కట్నాలుండవు గదాని సుధీర్ సంబరం "చెప్పు మరదలా.... ఆ అదృష్టవంతుడైవరో" ఖుషీగా అనేశాడు.

"ఏది ఏమైనా సరే.. నువ్వు కోరుకున్నవాడే నీవాడవుతాడు. చెప్పేయ్ చెల్లాయ్..." భారతిలో ఉత్సాహం ఉరకలేసింది.

"దేశ కోసం ప్రాణాలిచ్చేందుకు స్థిపడిన మధుకర్ బావంటే నాకెంతో ఇష్టం" మానస ఓరచూపులు మధుకర్ మీద వాలినై. మధుకర్ అంతరంగం సహస్ర దళపుష్పమై విచ్చుకుంది.

"చిన్నప్పట్నుంచి బావతో చెట్టాపట్టాలేసుకుని ఆడుకున్నాను. బావ ఆర్మీలో చేరతాననప్పుడే అతని జీవితాన్ని పంచుకోవాలని ఆశపడ్డాను. తర్వాత బావనుతప్ప మరొకర్ని చేసుకోవద్దని నిర్ణయించుకున్నాను. మన చుట్టూ రోజుకు వేయిమంది దైవభక్తులు కనపడినా స్పందించని మనసు ఒక దేశ భక్తుడు కనబడగానే ఉద్రూతలూగి పోతుంది. ఈ దీపావళి నా జీవితానికో దివ్య దీపావళి ఇంతకు ముందే మధు బావ మనసు తెలుసుకున్నాను. మధు బావ గుండె గుడిలో నేనున్నానన్న సంగతి తెలిసింది. నిర్మొహమాటంగా మాట్లాడుకున్నాం. మా ఇద్దరి జీవితాలు మూడు ముళ్లతో ముడిపడాలని నిర్ణయించుకున్నం..."

**'మనసు, ఆంధ్ర ప్రదేశ్ మే 2003**



ఐతా చంద్రయ్య